క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి


మొక్క నాటుతున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో హరిత అనంత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగా నాయక్, ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్ బేగం, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ నాయక్, శోభారాణి, శ్రీదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకోండి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గౌస్‌బాషా

పెద్దపప్పూరు: పిల్లల మీద అభిమానంతో ద్విచక్ర వాహనాలను ఇవ్వవద్దని, చిన్నపాటి ప్రమాదం చోటు చేసుకున్నా మీరే బాధపడాల్సి వస్తుందని ఎస్‌ఐ గౌస్‌బాషా అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల చేతికి ద్విచక్రవాహనం ఇవ్వవద్దన్నారు. ఏదైనా ప్రమాదం వాటిల్లితే జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు ఆయన జరిమానా విధించారు.

రాష్ట్రీయ హిందూ వాహిని సంస్థ అధ్యక్షుడిగా బాబా ప్రసాద్


బాబా ప్రసాద్

బుక్కరాయసముద్రం: రాష్ట్రీయ హిందూ వాహిని సంస్థ జిల్లా అధ్యక్షుడిగా బుక్కరాయసముద్రం శనీశ్వర దేవాలయం ప్రధాన అర్చకుడు ధర్మకర్త, అడ్వకేట్ బాబా ప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాబాప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఇంటింటికీ ధర్మ సందేశాన్ని, హిందూ ధర్మ శాస్త్ర నియమావళిని తీసుకెళ్తామన్నారు. అదే విధంగా గోసంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో జిల్లా కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర ద్వివేది, అయోధ్య ట్రస్ట్ అధ్యక్షుడు చంపక్ రాయ్, రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె శ్రీనివాసులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కసాపురంలో 30న సమావేశం

గుంతకల్లు రూరల్: శ్రావణమాసం ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఈ నెల 30న ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ భద్రాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో ఈ ఏడాది శ్రావణమాసం ఉత్సవాలు ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకూ నాలుగు వారాల పాటు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో రానున్న నేపథ్యంలో, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కౌలు రైతులకు అవగాహన


నెలగొండలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ, వెంకటాంపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ స్వాతి మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు పొందడం వల్ల కౌలు రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. పంటసాగు మొదలుకొని పండించిన పంటను విక్రయించేంత వరకూ గుర్తింపు కార్డులు కౌలు రైతులకు అనుకూలంగా ఉంటాయన్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆదర్శం.. అపహాస్యం


విజయనగర్ కాలనీలో స్వైర విహారం చేస్తున్న పందులు


సంజీవనగర్‌లో మురికికాలువలో దొర్లుతున్న పందులు

- పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు
- యథేచ్ఛగా పందుల సంచారం
- ఇబ్బంది పడుతున్న పట్టణ వాసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ఆదర్శ మున్సిపాలిటీ అపహాస్యం పాలవుతోంది. డ్రైనేజీలు పొంగి పొర్లి పట్టణం మురుగునీటితో చిత్తడి అవుతుండటంతో పాటు ఏ వీధిలో చూసినా పందులు స్వైర విహారం చేస్తుండటంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి పట్టణంలో 2008లో దాదాపు 20 కోట్లతో అండర్‌డ్రైనేజీ ఏర్పాటు చేశారు. తాడిపత్రి పట్టణ విస్తరణ, అభివృద్ధిపై అధికారులకు ముందుచూపు లేకపోవడంతో పాటు సరైన మరమ్మతులు లేకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. దీంతో పట్టణంలో రోజూ ఏదో ఓ చోట అధికారులు డ్రైనేజీ మరమతులు చేస్తూనే ఉన్నారు. చాలా చోట్ల మ్యాన్‌హోల్స్ మూతలు సరిగా లేక పోవడంతో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇళ్ల ముందు డ్రైనేజీలు పొంగిపొర్లుతూ దుర్వాసన వేస్తుండటంతో.. ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. పాదచారులు ముక్కు మూసుకుని నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక చిన్న వర్షం వచ్చిందంటే చాలు పలు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచి అపరిశుభ్రతకు కారణం అవుతున్నాయి. దీనికి తోడు ఆయా కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా కాలనీల్లో పందులు చిన్న పిల్లలపై, మహిళలపై దాడులు చేసి గాయపరిచిన సంఘటనలు చోటు చేసుకుని ఉండటంతో ప్రజలు భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడంతో పాటు పందులను పట్టణ శివారు ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

కుట్టుశిక్షణతో ఆర్థికాభివృద్ధి చెందండి


కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

గుంతకల్లుటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని ఆర్డీఓ శ్రీనివాస రెడ్డి సూచించారు. శనివారం ఎస్ఎన్ పేట అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణ శిబిరాన్ని గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ ఢిల్లీశ్వరితో కలసి ఆర్డీఓ ప్రారంభించారు. 105 రోజుల పాటు మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ టీఓ రషీద్ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శ్రీదేవి, కృష్ణవేణి, పుష్పలత, నాగేశ్వరి పాల్గొన్నారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ మండిపాటు

తన వార్డులో కేంద్ర ప్రభుత్వ సహకారంతోకుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నప్పుడు కనీసం తనకు సమాచారమివ్వాలన్న విషయం తెలియదా అంటూ 19వ వార్డు కౌన్సిలర్ మాణిక్యం ఐసీడీఎస్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్‌ను కాకుండా టీడీపీ నాయకులను ఏ విధంగా ఆహ్వానించారంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవిని ఆమె నిలదీశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, గుంతకల్లు అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, గుంతకల్లు రూరల్ శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన ఇతర నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్లతో చిన్నారులకు ప్రమాదం

తాడిపత్రి అర్బన్: చిన్నారులు స్మార్ట్‌ఫోన్లు వాడడం వల్ల పలు దుష్పరిణామాలకు దారి తీస్తుందని చిన్న పిల్లల వైద్య నిపుణుడు, అనంత యాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ హెచ్చరించారు. శనివారం స్థానిక చర్చి స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారుల్లో స్మార్ట్‌ఫోన్ల దుష్ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వాడకం చిన్నారుల పాలిట శాపంగా మారుతోందన్నారు. సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల కంటిలోని రెటీనా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్ చూడటం వల్ల చిన్నారులు డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని, నిద్రలేమి సమస్యలు, ఊబకాయం సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్నారులను సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సెక్రటరీ రఫీ, సభ్యులు షాకీర్, కుళ్లాయిస్వామి, జోసఫ్, మద్దిలేటి, బాలు, ఓబులేషు, గిరి, రహీం, కిషోర్, నవీన్, రామయ్య, అనిల్, విక్రమ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పామిడి: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు వీ వినోద్‌కుమార్ కోరారు. శనివారం ఆ సంఘ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థినుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులకు కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచాలన్నారు. హాస్టల్ పరమైన సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి, విద్యార్థినుల విద్యాప్రగతికి ప్రభుత్వం పాటుపడాలన్నారు. అలాగే కేజీబీవీలో కరెంట్ కోతలు అధిగమించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ కోశాధికారి లక్ష్మీప్రసాద్, నాయకులు రోహిత్, రామ్, ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

30న సేవాగఢ్‌లో మెగా వైద్య శిబిరం

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో ఈ నెల 30న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ ఆలయ ఆవరణలో జరిగే వైద్య శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, మధుమేహం, చెవి, ముక్కు, వెన్నముక తదితర సమస్యలకు వైద్యులు పరీక్షిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

తాడిపత్రి అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మండలంలోని తేరన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు కల్పనకు రూ.5 వేలు, కౌశిక్‌కు రూ.3వేలు, రాజశ్రీకి రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, సుబ్రమణ్యం, రమణరాజు, కరుణాకర్, సూర్యనారాయణరెడ్డి, అశ్వర్థరెడ్డి,పుల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు కృషి చేయాలి

పెద్దపప్పూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని ఎంపీడీఓ కవిత సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె తాగునీటి ట్యాంకులు, కుళాయిలు, మురికి నీరు ఉన్న చోట పారిశుధ్య కార్మికుల చేత బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి వచ్చే నెల 1న పింఛన్ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ ఆర్‌డీ కమలాబాయి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓఆర్డీ బీవీ శశికళ సూచించారు. శనివారం మండలంలోని పీ కొండాపురం ఈఓఆర్డీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శానిటేషన్ పనులు చేశారు. ఈసందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడారు. వారానికొకసారి డ్రై డే నిర్వహించాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడి


నారులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

గార్లదిన్నె: రైతులు వరిలో పచ్చిరొట్ట ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు శైలజకుమారి సూచించారు.శనివారం మండలంలోని శివరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరి పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరి సాగులో జీలుగ, జనుము, పిల్లి పెసర, వేసి దమ్ము చేయాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వల్ల 20 శాతం ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. అలాగే విత్తన శుద్ధి చేయడం వల్ల నారు దశలోనే రోగాలు నివారించవచ్చన్నారు. అలాగే జింక్ సల్ఫేట్ ఎకరాకు 20 కేజీలు, నారు మడిలో 2 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడిలో తక్కువ నీరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏడీఏ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

31న హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 31న హుండీలోని కానుకలు లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ భద్రాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన సూచించారు.

కలాం ఆశయ సాధనకు కృషి

గుంతకల్లుటౌన్: జీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల సాధనకు పాటుపడతామని విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, పట్టణ అధ్యక్షుడు మహేష్‌గుప్త అన్నారు. శనివారం కలాం 9వ వర్ధంతి సందర్భంగా 60 అడుగుల రోడ్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తాహేర్, మహబూబ్‌బాషా, జాకీర్, వికాస్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న మొహర్రం


కాడి పీర్ల నగర ప్రదర్శన

పామిడి: పామిడిలో శనివారం చిన్న మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 10వ ఖాన్‌ను పురస్కరించుకుని పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. ఈ సందర్భంగా భక్తులతో పీర్ల మకాన్లు కిటకిటలాడాయి. సాయంత్రం పీర్ల సవారీ నిర్వహించారు. భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రికి పీర్లను జలధికి తరలించారు.

రిమాండ్‌కు తరలింపు

పెద్దవడుగూరు: మండలంలోని లక్షుంపల్లెలో ఈ నెల 25న టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఘర్షణ పడగా.. ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా జడ్జి 15 రోజులు రిమాండు విధించారన్నారు. ఒక వర్గం వారిని గుత్తి సబ్ జైలుకు, మరో వర్గం వారిని అనంతపురం సబ్ జైలుకు తరలించామన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

గుత్తి: పట్టణంలోని కొత్తూరు అనాథాశ్రమంలో శనివారం ప్రభుత్వాస్పత్రి మిత్ర బృందం సభ్యులు రవి, రాము, విజయ్, హుస్సేన్‌వలి, వరప్రసాద్, మారుతి ఆధ్వర్యంలో సుమారు 60 మందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మిత్ర బృందం సభ్యుడు డీవీ గంగాధర్ 13వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన మిత్రులు దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు.

విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవాలి


కస్తూరిబా స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గౌతమి

గార్లదిన్నె: విద్యార్థులు రోజూ భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గౌతమి సూచించారు. శనివారం మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, మోడల్ పాఠశాలలో విద్యార్థుల భోజన వసతి, వంటశాల, టాయిలెట్స్, పరిసరాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరందించే ఫిల్టర్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు ఆహార పదార్థాలు వేడిగా అందించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఏఎన్ఎం సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


అనంతపురంలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి/తాడిపత్రి రూరల్: అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అభయ మిచ్చారు. రెండు రోజుల క్రితం రాజకీయ కక్షతో యాడికి మండలంలోని పుప్పాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్, మురళిని టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరచడంతో అనంతపురంలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి గాయపడిన మురళి, సుధాకర్‌ను పరామర్శించారు. భయపడొద్దని అండగా ఉంటానని, భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరలో ప్రతి గ్రామానికీ వెళ్లి నాయకులు, కార్యకర్తలను కలుస్తానని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు.

ప్రజలకు రక్షిత నీరందించండి


కలుషిత నీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ రమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పలు కాలనీలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నాయని, అధికారులు నిర్లక్ష్యం వీడి.. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టి ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ మాణిక్యం మాట్లాడుతూ తన వార్డులో కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, అనుమానముంటే పీహెచ్‌సీకి వెళ్లి విచారించుకోవాలన్నారు. మున్సిపాలిటీ ద్వారా సరఫరా అయిన పురుగులతో కూడిన కలుషిత నీటి డబ్బాను చైర్‌పర్సన్, కమిషనర్‌కు అందజేశారు. సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని ఎంఈకి చైర్‌పర్సన్ సూచించారు. కౌన్సిలర్లు కృపాకర్, మహాలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో పెరిగిపోయిన కుక్కలబెడదను అరికట్టాలని కోరారు. అల్లీపీరాకాలనీ వద్ద అర్ధాంతరంగా ఆపేసిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల్ని పూర్తిచేయాలన్నారు. కౌన్సిలర్ సుధాకర్, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబూ మాట్లాడుతూ చెత్తసేకరణ ఆటోలను నడిపే డ్రైవర్లకు పెండింగ్‌లో ఉండే వేతనాలు చెల్లించని ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. 37 వార్డుల్లో రోడ్లు,డ్రైనేజీలు, కల్వర్టులు, పైప్‌లైన్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

తన వార్డులో ఇద్దరు పారిశుధ్య కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వేధిస్తున్నారంటూ 19వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాణిక్యం ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నీరు ఎప్పుడు విడుదల చేస్తారని ప్రజలు ఫోన్ చేసి అడిగినప్పుడు కొందరు వాటర్‌మెన్‌లు నిర్లక్ష్యంగా, హేళనగా మాట్లాడుతున్నారంటూ ఫిర్యాదులు అందాయన్నారు. ఇకపై తీరు మార్చుకోకుంటే సస్పెండ్ చేస్తానని ఆయన హెచ్చరించారు.

రైల్వే ఆస్పత్రికి అంబులెన్స్ కేటాయించాలి


రైల్వే ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గుత్తి: రైల్వే ఆస్పత్రికి వెంటనే అంబులెన్స్ కేటాయించాలని రైల్వే కార్మికులు డిమాండ్ చేస్తూ శనివారం ర్యాలీ, ధర్నా చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని విభాగాలకు చెందిన కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయం వద్ద నుంచి రైల్వే ఆస్పత్రి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. డీఆర్ఎం, సీఎంఎస్, రైల్వే వైద్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రెటరీ రామాంజుల రెడ్డి, యూనియన్ నాయకులు శేఖర్‌బాబు, నరసింహ, ఎస్సీ ఎస్టీ సెక్రటరీ రామ్ నాయక్ తదితరులు మాట్లాడుతూ ఏడాది కాలంగా రైల్వే ఆసుపత్రికి అంబులెన్స్ లేదన్నారు. ఏడాది క్రితం అంబులెన్స్ కాలం ముగియడంతో మూలన పడేశారన్నారు. అప్పటి నుంచి అంబులెన్స్‌ను కేటాయించాలని డీఆర్ఎం, సీఎంఎస్‌కు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రైల్వే కార్మికులు అనారోగ్యానికి గురైతే అనంతపురం లేదా గుంతకల్లు వెళ్లాలంటే అంబులెన్స్ లేకపోవడం వల్ల కొందరు ప్రాణాలు సైతం కోల్పోవడం జరిగిందన్నారు. కార్మికుల ప్రాణాలంటే ఉన్నతాధికారులకు లెక్క లేకుండా పోయిందన్నారు. వెంటనే రైల్వే ఆసుపత్రికి అంబులెన్స్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గత శుక్రవారం డీజిల్‌షెడ్‌లో జూనియర్ క్లర్క్‌గా పని చేస్తున్న పరంధామకు గుండె పోటు వచ్చిందని, అంబులెన్స్ లేకపోవడంతోనే మృతిచెందాడన్నారు. అనంతరం రైల్వే డాక్టర్ విజయలక్ష్మికి అంబులెన్స్‌తో పాటు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైల్వే యూనియన్ నాయకులు, వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

ఆర్డీటీ క్రికెట్ పోటీల్లో బాలికలదే పైచేయి


ట్రోఫీని కైవసం చేసుకున్న బాలికల జట్టు

తాడిపత్రి అర్బన్: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బాలికలే పైచేయి సాధించారు. వారం రోజులుగా బాలురు, బాలికల మధ్య ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శ్రీచైతన్య స్కూల్, శ్రీవాణి పాఠశాలకు చెందిన బాలికలు, బాలుర జట్లతో పాటు పెద్దపప్పూరు మౌర్య హైస్కూల్, శ్రీవాణి హైస్కూల్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ బాలికల జట్టు విజయం సాధించింది. అలాగే శ్రీవాణి పాఠశాలకు చెందిన బాలురు జట్టు విజయకేతనం ఎగురవేసింది. పోటీల్లో గెలుపొందిన ఇరు జట్లకు కౌన్సిలర్ మల్లికార్జున బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ కోచ్ సాధిక్‌వలి, ఆర్డీటీ ఏటీఎల్ లలిత, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం


శింగనమల తహసీల్దార్ శోభన్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం


యాడికి తహసీల్దార్ మోహనవల్లిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది


గార్లదిన్నె తహసీల్దార్ లోకేశ్వరిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

శింగనమల: బదిలీ అయిన తహసీల్దార్ శోభన్‌బాబును శనివారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చానన్నారు. సిబ్బంది సహకారంతో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సీఎస్‌డీటీ రాజశేఖర్, సర్వేయర్ గోవిందరాజులు, ఆర్‌ఐ హనుమాన్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, ఏఎస్ఓ, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

యాడికి: తహసీల్దార్ మోహనవల్లి శనివారం సొంత జిల్లా చిత్తూరుకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా యాడికి మండలానికి వచ్చిన తహసీల్దార్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీ అయ్యారు. బదిలీపై అయిన తహసీల్దార్‌ను యాడికి డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది సత్కరించారు. కార్య క్రమంలో ఆర్‌ఐ ఆనందబాబుచారి, వీఆర్‌ఓలు, సచివాలయ వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గార్లదిన్నె తహసీల్దార్ బదిలీ

గార్లదిన్నె: తహసీల్దార్ లోకేశ్వరి శనివారం బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్‌ఐ లహరిక, వీఆర్‌ఓలు ,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.